# సర్వులయందున్న పరమాత్ముడు ఒక్కడే

ప్రియమైన విద్యార్థులారా! అనాది కాలమునుండి లోకములో అందరూ భగవంతుని ఆశించి, ఆరాధించి, భగవంతుని చేరుకోవాలని తపిస్తున్నారు. దైవాన్ని చింతించి, వర్ణించి, దర్శించి, దైవముతో ఐక్యం కావాలనే ఉద్దేశ్యముతో అనేకమంది ఋషులుకూడా ఈవిధంగా తపిస్తూ వచ్చారు. దైవాన్ని చేరుకోవడానికి నవవిధ మార్గములు నిర్దేశింపబడినాయి.

శ్రవణం కీర్తనం విష్ణోఃస్మరణం పాదసేవనం
వందనం అర్చనం దాస్యం స్నేహ మాత్మ నివేదనం

ఆనాడు మొదలుకొని నేటివరకు భక్తులు ఈ నవవిధ మార్గములను అనుసరిస్తూ వచ్చారు.

ఒక పర్యాయం నారదుడు శ్రీమన్నారాయణునివద్దకు వెళ్ళి, 'స్వామీ! మేము మీ దివ్యనామమును ఉచ్చరిస్తున్నాముగాని, ఆ నామరసము మీయందున్నది. ఆ నామరసమును మీరు మాకు అనుగ్రహించినప్పుడే మేము ధన్యులమవుతాము', అన్నాడు. కాని, కొందరు అట్టి నామస్మరణయొక్క విశిష్టతను సరిగా అర్థం చేసుకోలేక ఇందుకు విరుద్ధంగా ప్రచారం చేస్తూ వచ్చారు. ఇలాంటి 'రాజకీయాలు' ఆనాటి మొదలు నేటివరకు వున్నాయి. ఎవరైనా ఒకటి చెబితే దానికి విరుద్ధంగా చెప్పేవారు ముగ్గురుంటారు. అయితే, ఎదుటి వ్యక్తిలో వున్న దోషాన్ని వ్రేలెత్తి చూపిస్తే, మూడు వ్రేళ్ళు నిన్నే చూపుతాయి. అది నీవు గుర్తించుకోవడం లేదు.

కొందరు నారదునివద్దకు వెళ్ళి, 'అయ్యా! మీరు చెప్పినట్లుగా మేము నామస్మరణ చేస్తూనే ఉన్నాము. కాని, మాకు దైవము కనిపించడం లేదు', అన్నారు. 'ఎంతమాత్రమని ఎవ్వరు తలచిన అంతమాత్రమే నేను, అన్నాడు భగవంతుడు. భగవంతునికోసం మీరు ఎంతగా తపిస్తారో అంతగా మీపై భగవదనుగ్రహము ప్రసరిస్తుంది', అని చెప్పాడు నారదుడు. భగవంతుని విషయంలో ఆనాటి మొదలు ఈనాటివరకు వాదోపవాదములు జరుగుతూనే వస్తున్నాయి. 'వట్టి నామము చెబితే ప్రయోజనమేమిటి? ఇది కేవలం

srisathyasaivachanamrutam

సోంబేరులు చేసే పని', అంటారు కొందరు. కొంతమంది భగవన్నామాన్ని పైకి ఉచ్చరిస్తే ఎవరైనా ఏమన్నా అనుకుంటారేమోననే అభిమానముచేత లోపలనే మననము చేసుకుంటూ, స్మరిస్తూ ఉంటారు. ప్రపంచంలో ఒక్కొక్కరు ఒక్కొక్క రకంగా ఉంటారు. ఎవరికి ఏ సాధన ఇష్టమో వారది చేసుకోవచ్చును. మిగిలినవారు దానికి అడ్డు చెప్పడానికి వీలులేదు. సర్వులయందున్న పరమాత్ముడు ఒక్కడే.

రాధకు ప్రభ అనే ఒక చెల్లెలుండేది. రాధ నిరంతరము, 'నాకు కృష్ణుడు కావాలి, కృష్ణుడు కావాలి', అని కోరుతూ వచ్చింది. కాని, ప్రభ మాత్రం, 'నాకు కృష్ణుడే వద్దు', అనుకుంది. ఇరువురి భావములు పరస్పరం విరుద్ధంగా ఉండేవి. రాధ ఒక్క క్షణమైనా కృష్ణుని వదలి ఉండేది కాదు. ప్రభ తన భర్తను విడిచి క్షణమైనా ఉండేది కాదు.

ఒకనాడు రాధ కృష్ణుని తమాషాగా అడిగింది, 'స్వామీ! ప్రభ మిమ్మల్ని దూషిస్తున్నది. మీరు ఆమె మనస్సును మార్చవచ్చును కదా', అని. 'రాధా! నీకెందుకు ఆ చింత? దేనికైనా సమయం రావాలి. దూషణ, భూషణ, తిరస్కారములు నాకేమీ అంటవు. కొందరు భక్తితో నన్ను పూజిస్తారు; మరికొందరు ద్వేషంతో దూషిస్తారు. ఈ రెండింటినీ నేను ఒకటిగానే తలుస్తాను. నాయందు ఎట్టి దోషములూ లేవు. నా చేతిలో ఉన్న వస్తువునుగురించి నాకు తప్ప అన్యులకు తెలియదు. కాబట్టి, ఎవరు ఏమనుకుంటే నాకేమి! మానవులు మాయలో ఉంటారు. అందుచేత, మోహములో చిక్కుకుంటారు. 'బ్రహ్మ విత్ బ్రహ్మైవ భవతి' అన్నట్లుగా, బ్రహ్మను తెలుసుకున్నవాడు బ్రహ్మగానే రూపొందుతాడు. బ్రహ్మను తెలుసుకోవాలంటే భ్రమను త్యజించాలి', అన్నాడు కృష్ణుడు.

భగవంతుడు ఎట్టి లీలలైనా చూపవచ్చును. కాని, కలికాలము దీనిని అంగీకరించదు. ఎవరు అంగీకరించినా, అంగీకరించకపోయినా భగవంతుని లీలలు భగవంతునివి. భగవంతునియందు ఎట్టి దోషములూ ఉండవు. పైగా, మానవులు చేసే దోషములన్నింటినీ సరిజేస్తాడు. ఎవ్వరినీ ఏమాత్రము దూరం నెట్టడు. తనపట్ల భక్తులలో 'అటాచ్‌మెంట్' అభివృద్ధి చేయడానికే తాను అనేక రూపాలను ధరిస్తుంటాడు; అనేక లీలలను ప్రదర్శిస్తుంటాడు. అనేక రకములుగా యుక్తులు చేస్తుంటాడు. కృష్ణుని లీలలు ఎవ్వరూ

sri sathyasai vachanamrutam

అర్థం చేసుకోలేరు. కొన్నిసార్లు తాను అనేక అద్భుతాలను ప్రదర్శిస్తాడు. మరికొన్ని పర్యాయములు పామరునివలె ప్రవర్తిస్తాడు. కాని, కృష్ణుడు పామరుడు కాడు. కృష్ణుడు కృష్ణుడే! భగవంతుని లీలలు ఏవిధంగా ఉంటాయో ఎవ్వరికీ చెప్పడానికి వీలుకాదు. కృష్ణుడు లీలామానుష విగ్రహుడు. కాని, ఆయన లీలలను ఆయనకు ఎంతో సన్నిహితంగా ఉన్నవారే నమ్మలేకపోయారు. కృష్ణుడు ఎందుకు ఈవిధంగా లీలలను చూపించాడు? ఇది కేవలం జగత్తులోని మానవులను ఆకర్షించి, తద్వారా వారిలో భక్తిప్రపత్తులను పెంచడానికే. భగవంతునితో భక్తులకు 'అటాచ్‌మెంట్' ఏర్పరచడంకోసమే తాను ఈవిధంగా చేస్తాడు. కృష్ణునికి ఎటువంటి వాంఛలూ లేవు. అటువంటి కాంక్షలు లేని భగవంతునిగురించి మానవుడు అనేకరకములుగా అపోహలు కల్పించుకోవడం మనస్సుయొక్క దోషమే!

కొద్ది రోజుల తరువాత ప్రభలో చాలా మార్పువచ్చింది. ఆమెకూడా రాధతోపాటు కృష్ణుని పూజిస్తూ వచ్చింది. రాధతో చేరి ప్రభకూడా రాధగా మారిపోయింది. ఎట్టి సంగమో అట్టి గుణము. నీ స్నేహితుడు ఎలాంటివాడో నీవుకూడా అలాంటివాడవే అవుతావు. అందువల్లనే, రాధ, ప్రభ ఇద్దరూ ఒక్కటైపోయారు. ప్రభకు మరొక పేరు చంద్రిక. తల్లి పిలిచే పేరు 'ప్రభ', బయట ప్రజలు పెట్టిన పేరు 'చంద్రిక'. ఈరీతిగా కొందరికి రెండు మూడు పేర్లుండడం సహజమే. ప్రభ, రాధ ఇరువురి మనస్సులు ఏకమైపోయాయి. మనస్సులు ఏకమవడం చాలా కష్టం. మానవుడు దేనినైనా మార్చవచ్చునుగాని, మనస్సును మార్చడానికి వీలుకాదు. అది కేవలం భగవంతునికి మాత్రమే సాధ్యం. 'మావాని మనస్సు మార్చండి స్వామీ, వాడు తల్లిదండ్రులపై చాలా ద్వేషంగా ఉన్నాడు', అని కొందరు నన్ను అడుగుతుంటారు. 'మనో మూల మిదం జగత్'. ఈ ప్రపంచమంతా మైండుపైననే ఆధారపడి యున్నది.

ప్రాను దిద్దవచ్చు మరి వంపు లేకుండ
దిద్దవచ్చు రాయిని తిన్నగాను
మనసు దిద్దగలర మరి వంపు లేకుండ?!
ఉన్నమాట తెలుపుచున్న మాట

మనస్సును మార్చడమనేది మానవులకు సాధ్యమయ్యే పని కాదు. ఇలాంటి పరిస్థితియందు మానవునికి భగవంతునిపై విశ్వాసము దృఢమైనదిగా ఉండాలి. భగవంతునిపై విశ్వాసము పెట్టుకుంటే తాను తప్పక సహాయం చేస్తాడు. భగవంతుడు ఒక రూపానికి పరిమితం కాడు. అదొక అనంతమైన శక్తి. ఆ శక్తిచేత ఎట్టి మార్పునైనా చేయవచ్చును. దైవము ఎన్ని రూపములైనా ధరించవచ్చును. కాని, దివ్యశక్తి ఒక్కటే. అందరియందు శక్తి వేరువేరుగా ఉందని మీరు భావిస్తున్నారు. కాని, వేరువేరుగా ఉండదు. ఈ దేహమునందు ఏ ఆత్మ ఉంటున్నదో అదేరీతిగా ఆ దేహమునందుకూడా అదే ఆత్మ ఉంటున్నది. AC కరెంటు, DC కరెంటు అని పేర్లు మారవచ్చునేగాని, కరెంటు ఒక్కటే కదా! అదేరీతిగా, ఆత్మ అందరియందు ఒకేరీతిగా ఉంటున్నది. అయితే, వారివారి ప్రాప్తి కొద్దీ వారి మనస్సును మార్పు చేసుకుంటూ వస్తాడు, భగవంతుడు. మానసిక సంబంధమైన మార్పు మంత్రాలవల్ల, యంత్రాలవల్ల, తంత్రాలవల్ల జరిగేది కాదు. భగవంతుడు మార్చినప్పుడే మనస్సు మారుతుంది. భగవంతుడు ఏమైనా చేయగలడు; ఎక్కడికైనా వెళ్లగలడు. కౌరవుల దగ్గరకు వెళ్ళినా, పాండవుల దగ్గరకు వెళ్ళినా కృష్ణుడు ఒక్కడే. కాని, కౌరవులకు ఒక విధంగా, పాండవులకు ఒకవిధంగా కనిపించాడు. 'భగవంతుడు మారిపోయాడు', అనుకోవడం చాలా పొరపాటు. భగవంతుడు మారడానికి ఏమాత్రం అవకాశం లేదు. 'నిర్గుణం, నిరంజనం, సనాతనం, నికేతనం, నిత్య, శుద్ధ, బుద్ధ, ముక్త, నిర్మలస్వరూపిణం'. ఇటువంటి భగవత్తత్త్వాన్ని అందరూ అర్థం చేసుకోలేరు.

ప్రేమస్వరూపులారా! భగవంతుని ప్రేమకు మరొకరి ప్రేమ ఏమాత్రము సాటిరాదు. ఈ ప్రేమ మారేటటువంటిది కాదు. ఎన్ని రూపములు ధరించినప్పటికీ ప్రేమ మారేది కాదు. ఏ పేరుతోనైనా పిలువవచ్చు. 'వేంకటేశ్వరా!' అనండి. 'రామా!' అనండి. 'కృష్ణా! అనండి. 'సాయిబాబా' అనండి. పేర్లు మారినాయిగాని, తాను ఒక్కడే. అందుకోసమే చెప్పారు, 'ఏకమేవ అద్వితీయం బ్రహ్మ' అని. కొంతమంది, 'దేవుడు రాముడుగా మారినాడు, కృష్ణుడుగా మారినాడు. కాబట్టి, మరో దేవుడు లేడు', అంటారు. అది మీ దృష్టిలో వచ్చిన మార్పేగాని, దేవునిలో వచ్చిన మార్పు కాదు. రూపనామములలో మార్పు వచ్చినంతమాత్రమున భగవంతుడు ఎప్పుడూ మారడు. భగవంతుని సంకల్పము చాలా

srisathyasaivahini.org

గొప్పది. తన సంకల్పముద్వారా తాను సర్వమును మార్చగలడు. కాని, ఆవిధంగా మార్చడం భగవంతునికి నచ్చదు.

ప్రేమస్వరూపులారా! మీ ప్రేమను పవిత్రంగా ఉంచుకోండి. పవిత్రతయే దివ్యత్వము. మీ వ్యక్తిగతమైన ప్రేమను పవిత్రమైన దైవప్రేమగా మార్చుకోండి. దైవప్రేమను అభివృద్ధిపరచుకుంటే మీరు ఎన్నైనా చేయవచ్చును, ఎన్నైనా చూడవచ్చును. భగవంతుని మనస్సు మారిపోయిందేమోనని కొందరు సందేహిస్తుంటారు. కాని, భగవంతుని మనస్సు మారేది కాదు. అది స్థిరమైనది. అది 'యూనివర్సల్ మైండ్'. అప్పటికప్పుడు ఏదేది కావాలో ఆవిధంగా సంకల్పించుకుంటుంది. భగవంతుడు ఏమైనా చేయగలడు; ఏమైనా మార్చగలడు. ఒక్క క్షణములో అందరికీ దర్శనము ఇవ్వవచ్చును. ఒక్కొక్కరికి దర్శనము ఇవ్వకుండాపోవచ్చును. అది వారివారి మనస్సును బట్టి చేయవచ్చును.

ప్రేమస్వరూపులారా! ఈనాడు ఇట్టి రహస్యమును తెలుసు కోవడం అత్యవసరం. ఒక్క 'డివినిటీ'ని మీరు తెలుసుకుంటే, విశ్వమునంతా తెలుసుకున్నట్లే. కనుక, ఈ ఒక్కదానిని గుర్తించండి. కొంతమంది కొంతకాలం భక్తిగా ఉంటారు. తరువాత మనస్సు మార్చుకుంటారు. ఆవిధంగా మీరు మార్చుకోకూడదు. చలించని దృష్టి, భ్రమించని మనస్సుతో ఉన్నప్పుడు భగవంతుడు మిమ్మల్ని ఎంతైనా అనుగ్రహిస్తాడు. భగవంతునిలో మీరు లీనమైపోవాలి. ఏక మనస్సుతో ఉండాలి. అనేకమంది యోగులు, జోగులు, విరాగులు, బైరాగులు ఆవిధంగా ఏక మనస్సుతో ఆరాధించి భగవంతుని దర్శించగలిగారు.

నేను హృషీకేశ్‌కు వెళ్ళినప్పుడు అక్కడ వసిష్ఠగుహలో పురుషోత్తమానంద ఉండేవాడు. ఆ గుహలో ఒక చిన్న దీపము పెట్టుకొని ఆయన ఒక్కడే అక్కడుండేవాడు. రోడ్డుపైకి వచ్చి ఎవరైనా వెళుతుంటే 'కొంచెం పాలు ఇవ్వండి' అని అడిగి తీసుకునేవాడు. వాటితో టీ చేసుకుని త్రాగేవాడు. అప్పటికి ఆయన బాగా వృద్ధుడైనాడు. కట్టకడపటికి రోడ్డుమీదకు వెళ్ళడానికి కూడా ఆయనకు శక్తి లేకపోయింది. ఆ కొండ చాలా ఎత్తైనది. రెండు చేతులు, రెండు కాళ్ళ సహాయంతో ప్రాకుతూ ఆయన కొండనెక్కేవాడు. ఎవరైనా పాలు ఇస్తే వాటిని ఒక వారం రోజులు పెట్టుకునేవాడు. తిరిగి వారంవరకు ఎవరివద్దకూ

sri sathyasai vachanamrutam

పోయేవాడు కాదు.

నేను అక్కడికి వచ్చానని తెలుసుకొని, 'భగవాన్, దయచేసి ఒకసారి వచ్చి దర్శనమివ్వండి', అని ఒక చీటీ వ్రాసి పంపించాడు. అది చూసి నేను వెంటనే వెళ్ళాను. నావెంట కస్తూరికూడా వచ్చాడు. పురుషోత్తమానంద ఆనందానికి అవధుల్లేవు. 'ఈనాడు నేను నిజంగా పురుషోత్తముని దర్శించుకున్నాను. నా జన్మ తరించింది', అంటూ ఆనందబాష్పాలు రాల్చాడు. ఆయనకు తాళం కొట్టడానికి కస్తూరి కూడా అక్కడే ఉన్నాడు. ఆయన నన్ను తనదగ్గరే కూర్చోపెట్టుకొని కస్తూరితో, 'మీరు లోపలికి వెళ్ళి చూడండి', అని చెప్పాడు. కస్తూరి ఎంతైనా జర్నలిస్టు కదా! లోపల ఇంకేమైనా సమాచారం లభిస్తుందేమోనన్న ఆశతో లోపలికి పోయాడు. పురుషోత్తమానంద మాత్రం నాపైననే తన దృష్టిని కేంద్రీకరించి సమాధి స్థితిలోకి వెళ్ళాడు.

ఆయన ప్రార్థనను మన్నించి రెండవ దినం కూడా నేనక్కడికి వెళ్ళాను. అక్కడినుండి తిరిగి వచ్చేసేటప్పుడు కస్తూరి దగ్గర ఒక చిన్న కాగితం తీసికొని 'నేను మళ్ళీ ఫలాని తేదీన, ఫలాని టైమ్‌కు వస్తాను', అని వ్రాసి పురుషోత్తమానంద చేతికిచ్చాను. ఆరోజున ఆయన గంగానదిలో స్నానం చేసి వచ్చి నా దర్శనంకోసం ఎదురు చూస్తూ కూర్చున్నాడు. చెప్పిన సమయానికి నేను ఆయన ఎదుట సాక్షాత్కరించాను. ఆనందంగా స్వామిని చూస్తూ చూస్తూ ఆయన స్వామిలో ఐక్యం చెందాడు. 'పురుషోత్తమానంద మీలో చేరిపోయారు', అని ఆయన శిష్యులు నాకు టెలిగ్రామ్ ఇచ్చారు. ఆ సమయంలో రాజారెడ్డి కూడా ఉన్నాడు. పురుషోత్తమానంద పుట్టిన దినము, సమాధి చెందిన దినము రెండూ ఒక్కటైనాయి. 'ఆయన గుహలోకి వెళ్ళి మీరు చూడండి' అని చెప్పాను. ఆ గుహను తెరచి చూస్తే అంతా భస్మంతో నిండి వుంది. శివానందాశ్రమంవారు ఆయన దేహాన్ని గంగలోనికి వదిలారు. ఆ తరువాత ఆయన శిష్యులందరూ పుట్టపర్తికి వచ్చి పదిరోజులున్నారు. వారికి నేను తగిన గౌరవ, మర్యాదలు చేసి పంపించాను.

పురుషోత్తమానంద నిజంగా పేరుకు తగినట్లుగా పురుషోత్తముడే! ఆయనవద్దకు నేను రెండు దినములు వెళ్ళినాను. ముందు ఒక దినమే వెళదామనుకున్నాను. కాని, ఆయన

srisathyasaivechanamrutam

కోరినమీదట మళ్ళీ రెండవ దినము వెళ్ళి ఆయనను సంతోషపెట్టాను. అక్కడినుండి వచ్చిన తరువాత శివానంద, 'స్వామీ, అక్కడికి మీరు రెండు రోజులు వెళ్ళారు. మా ఆశ్రమంలో ఎక్కువ సమయం గడపలేదే', అని బాధపడ్డాడు. ఇప్పటికీ ఆ వసిష్ఠగుహ అలాగే ఉంది. 'స్వామీ, ఇప్పటికీ మాకు పురుషోత్తమానంద ఉన్నట్లుగానే కనిపిస్తున్నది', అన్నారు, ఆయన శిష్యులు. 'అట్లే మీరు భావించి ఆనందంగా ఉండండి', అని వారికి నేను చెప్పాను. పోయినతూరి నేను ఢిల్లీకి వెళ్ళినప్పుడు పురుషోత్తమానంద పుట్టిన తేదీన అతని ఫోటో పెట్టించి అందరితో భజన చేయించాను. ఈవిధంగా అనేకమంది ఋషులు స్వామి దర్శనార్థం ఎంతో పరితపిస్తున్నారు. అక్కడ వాళ్ళు ఆవిధంగా ప్రేమిస్తున్నారు, ఇక్కడ మీరు ఈవిధంగా ప్రేమిస్తున్నారు.

శ్రీవారి దివ్యబోధ
**తేదీ 11.10.2005**

sri sathyasai vachanamrutam